క్లుప్తంగా

లక్ష్మీనరసింహస్వామికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో లక్ష్మీనరసింహస్వామి

గోపవరం : మండలంలోని వల్లెరవారిపల్లెలో కొలువైన శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో భాద్రపద మాసం రెండవ శనివారం సందర్భంగా వేకువజాము నుంచి స్వామి వారికి ప్రత్యేక అభిషేకం, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తుల దర్శనార్థం స్వామివారు ఆకుకూరలతో ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చారు. స్థానికులతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ పూజారి పెంచలయ్యస్వామి వచ్చిన భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం అన్నదానం ఏర్పాటు చేశారు.

బాల్య వివాహాలను అరికట్టాలి



మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రశాంతి

మైదుకూరు : బాల్య వివాహాలను అరికట్టాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జె.ప్రశాంతి అన్నారు. పోషణ్ మాసోత్సవాల్లో భాగంగా శనివారం బాలాజీ నగర్ అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ ప్రశాంతి మాట్లాడుతూ ఆడ పిల్లలకు చిన్న వయసులోనే పెళ్లి చేయడం చట్టరీత్యా నేరమని అన్నారు. బాల్య వివాహాలను చేసేవారిపై, ప్రోత్సహించే వారిపై అధికారులకు ఫిర్యాదు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో బాలాజీ నగర్, మైదుకూరు–2 అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

బొల్లు రామమోహన్ కవితకు ప్రశంసలు

పోరుమామిళ్ల : పోరుమామిళ్లకు చెందిన రచయిత, కవి బొల్లు రామమోహన్ చేసిన 'భువిలో దివ్య దేవతలు' కవితాగానానికి ప్రశంసతో పాటు బహుమతి అందజేశారు. శనివారం హిందీ సాహిత్య భారతి, తెలంగాణ వారు హైదరాబాదు కేంద్రీయ హిందీ సంస్థాన్‌లో నిర్వహించిన వార్షికోత్సవంలో రామమోహన్ కవితాగానం చేశారు. ఆయన కవితాగానాన్ని అభినందిస్తూ ఉత్తరప్రదేశ్ మాజీ విద్యాశాఖ మంత్రి డాక్టర్ రవీంద్రశుక్లా బహుమతి అందజేశారు.

జీపీఎస్‌కు నిరసనగా ఫ్యాప్టో ఆధ్వర్యంలో ధర్నా

పోరుమామిళ్ల : ఓపీఎస్ అమలు చేయమని అడిగితే ప్రభుత్వం జీపీఎస్ అమలు చేయడం అన్యాయమని ఫ్యాప్టో జిల్లా నాయకుడు పి.రమణారెడ్డి తెలిపారు. శనివారం స్థానిక తహసీల్దారు కార్యాలయం ఎదుట జీపీఎస్‌ను నిరసిస్తూ ధర్నా చేసి మాట్లాడారు. సీపీఎస్‌కు ప్రత్యామ్నాయం ఓపీయస్ మాత్రమేనని మరొకటి అంగీకరించబోమన్నారు.

రేపు పల్లవోలులో ఫ్యామిలీ డాక్టర్ వైద్య శిబిరం

చాపాడు : మండల పరిధిలోని పల్లవోలు గ్రామంలో సోమవారం ఫ్యామిలీ డాక్టర్ వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు మండల వైద్యాధికారి డాక్టర్ శ్రీవాణి తెలిపారు. గ్రామంలో ఉదయం 9.30గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకూ నిర్వహించే వైద్య శిబిరంలో అన్ని రకాలైన వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు పంపిణీ చేస్తామన్నారు. అవకాశాన్ని గ్రామ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వైద్యాధికారి కోరారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం



రాజుపాళెం: కూలూరులో పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ అరుణ

రాజుపాళెం : పౌష్టికాహారంతోనే గర్భిణులు ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ సీడీపీఓ అరుణ తెలిపారు. మండలంలోని కూలూరు గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం–2లో కార్యకర్త శ్రీకళ ఆధ్వర్యంలో శనివారం పోషణ వేడుక మాసోత్సవాలలో భాగంగా గర్భిణులు, బాలింతలు, తల్లులకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించి, వారికి పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ లక్ష్మీదేవి, ఏఎన్ఎం సుభద్ర, వెల్ఫేర్ అసిస్టెంట్ ప్రదీప్, అంగన్‌వాడీ కార్యకర్తలు మంజుల, కృష్ణవేణి, సరస్వతి, స్వర్ణలత, రేష్మమేరి, ఆశా, ఆయాలు పాల్గొన్నారు.

బొజ్జగణపయ్యా.. ఇక సెలవయ్యా!



మిట్టమడివీధిలోని గణనాథుడి రథం లాగుతున్న భక్తులు

ప్రొద్దుటూరు కల్చరల్ : పట్టణంలోని పలు ప్రాంతాల్లో కొలువుదీరిన వినాయక విగ్రహాలను శనివారం పలువురు గణపతి ఉత్సవ కమిటీ వారు ఘనంగా గ్రామోత్సవం నిర్వహించారు. కొన్ని ఉత్సవ కమిటీల వారు భక్తులకు పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. రంగులు చల్లుకుంటూ జై బోలో గణేష్ మహారాజ్ అంటూ నినాదాలు చేస్తూ ఆనందంగా పార్వతీ పుత్రున్ని సాగనంపారు. దారి వెంబడి భక్తులు కొబ్బరికాయలు కొట్టి కర్పూర హారతులు ఇచ్చి గణపయ్యా ఇక సెలవంటూ భక్తిశ్రద్ధలతో పూజించారు. మిట్టమడి వీధిలో గజకర్ణ ఉత్సవ కమిటీ వారు వినాయక విగ్రహాన్ని వాహనంపై ఉంచి రథోత్సవం లాగా లాగి తమ భక్తిచాటుకున్నారు. కొన్ని వినాయక విగ్రహాల కమిటీ వేడుకల్లో భాగంగా మహిళలకు రంగవల్లుల పోటీలు నిర్వహించి బహుమతులు అందచేశారు.

వరసిద్ధి వినాయకుడికి మున్సిపల్ వైస్ చైర్మన్ పూజలు

ప్రొద్దుటూరు : మున్సిపాలిటీ పరిధిలోని సంజీవనగర్‌లో పెద్ద గుంత వద్ద శ్రీవరసిద్ధి ఉత్సవ కమిటీ వారు ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాన్ని శనివారం మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి దర్శించుకుని పూజలు చేశారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ వారు ఆయనను సత్కరించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా వినాయకుడి నిమజ్జనం

రాజుపాళెం : మండలంలోని వెంగలాయపల్లె, పగిడాల, టంగుటూరు తదితర గ్రామాల్లో వినాయకుడి నిమజ్జన వేడుకలను ఆయా గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. చెక్కభజన, డప్పు వాయిద్యాల నడుమ బాణసంచా పేల్చుతూ గణేష్ మహరాజ్‌కి జై అంటూ ట్రాక్టర్లలో తీసుకెళ్లారు. యువకులు, పిల్లలు, మహిళలు, పెద్దలు రంగులు చల్లుకుంటూ ఆనందంలో మునిగి పోయారు.



రాజుపాళెం: టంగుటూరు వద్ద కుందూనదిలో వినాయకుడిని నిమజ్జనం చేస్తున్న భక్తులు



వినాయక విగ్రహం వద్ద మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి

గ్రామాల్లో వినాయకుడి లడ్డూల వేలంపాట

రాజుపాళెం : వినాయక చవితి పండుగను పురస్కరించుకుని మండలంలోని పలు గ్రామాల్లో వినాయకుడి వద్ద ఉంచిన లడ్డూలకు వేలం పాట నిర్వహించారు. వెంగళాయపల్లెలోని ఎస్సీ కాలనీలో గ్రామ సర్పంచ్ ధనిరెడ్డి రేణుకమ్మ మనుమడు ధనిరెడ్డి ఆయాన్స్ రూ.20వేలకు పాటపాడి దక్కించుకున్నారు. గ్రామంలోని అంకాలమ్మ ఆలయం వద్ద ఏర్పాటు చేసిన వినాయకుడి వద్ద ఉమ్మడి సంజీవరెడ్డి రూ.60,002లకు పాటపాడి దక్కించుకున్నాడు. అలాగే రాజుపాళెంలోని హరిజనవాడలో లడ్డూను వేలం పాట నిర్వహించారు. పెద్దకాటిగాళ్ల పెద్దన్న రూ.30వేలకు వేలంపాటలో లడ్డును దక్కించుకున్నారు. గాదెగూడూరు గ్రామంలో బావికట్ట వద్ద వినాయక లడ్డును వేలంపాట నిర్వహించగా పోలా వెంకటేశ్వరరెడ్డి రూ.35,500కు చేజిక్కించుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పోలా వరలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకుడు పోలా వెంకటరెడ్డి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు. టంగుటూరులో తొట్టిబడి వద్ద ఏర్పాటు చేసిన వినాయకుడి లడ్డూను ముక్కర్ల నరసింహారెడ్డి రూ.30,100 పాట పాడి దక్కించుకున్నారు.

గృహ సారథులకు బీమా సౌకర్యం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి

మైదుకూరు : రాష్ట్రంలోని సచివాలయ కన్వీనర్లు, గృహసారథులకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బీమా సౌకర్యం కల్పించనున్నారని ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి తెలిపారు. శనివారం మైదుకూరులోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో జేసీఎస్ జిల్లా కోఆర్డినేటర్ కల్లూరు నాగేంద్రరెడ్డితో కలిసి నియోజకవర్గంలోని సచివాలయ కన్వీనర్లు, గృహ సారధులతో అవగాహన కార్యక్రమంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను ప్రజల వద్దకు చేర్చడంలో గృహసారధులు, సచివాలయ కన్వీనర్లు తమ వంతు కృషి చేస్తున్నారని అన్నారు. వారికి బీమా సౌకర్యం కల్పిస్తూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సామాజిక భద్రతను కల్పిస్తున్నారని పేర్కొన్నారు. ఈ నెలాఖరులో ప్రారంభమయ్యే జగనన్న ఆరోగ్య సురక్షకార్యక్రమం విజయవంతం అయ్యేందుకు సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు కృషి చేయాలని ఎమ్మెల్యే తెలిపారు. రాష్ట్రంలో ప్రతి ఒక్కరూ ఆరోగ్యంతో ఉండాలనే గొప్ప లక్ష్యంతో సీఎం వైఎస్ జగన్ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఆయా సచివాలయ పరిధిలోని అనారోగ్యంతో ఉన్న వారిని గుర్తించి వారికి వైద్య చికిత్సలు అందే విధంగా కృషి చేయాలన్నారు. ఓటర్ల జాబితాలో రెండు చోట్ల ఓటు హక్కు ఉండటం, ఓటు హక్కు ఉన్న చోట నివాసం లేకపోవడంపై ప్రతిపక్ష పార్టీలు లేవనెత్తిన అభ్యంతరాలను సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు పరిశీలించాలని సూచించారు. సచివాలయ కన్వీనర్లు, గృహ సారథుల జిల్లా కోఆర్డినేటర్ కల్లూరు నాగేంద్రారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పథకాల అమలులో నిరంతరం శ్రమిస్తున్న సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులకు బీమా సౌకర్యం కల్పించే ప్రక్రియను సీఎం వైఎస్ జగన్ వేగవంతం చేశారని తెలిపారు. ఇందుకోసం గృహ సారధులు, సచివాల కన్వీనర్లుగా ఉన్న వారి పూర్తి వివరాలను సేకరించే పని జరుగుతోందన్నారు. సమావేశంలో మైదుకూరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త శెట్టిపల్లె నాగరెడ్డి, నియోజకవర్గంలోని జేసీఎస్ మండల కన్వీనర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

అంబేడ్కర్‌కు వినతి

ప్రొద్దుటూరు : స్థానిక పాత బస్టాండ్ వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి శనివారం జీపీఎస్‌కు వ్యతిరేకంగా ఏపీఎస్టీఎఫ్ నాయకులు వినతి పత్రం ఇచ్చారు. ఏపీఎస్టీఎఫ్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు సి.శ్రీనివాసులు మాట్లాడుతూ పాత పెన్షన్ విధానం మాత్రమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్టీఎఫ్ సీపీఎస్ జిల్లా కన్వీనర్ నరేష్, పట్టణాధ్యక్షుడు హరిరామకృష్ణ, జోసెఫ్, జాకీర్ పాల్గొన్నారు.

దూదేకులను ముస్లింలుగా గుర్తించాలి

కడప కల్చరల్: దూదేకుల కులస్తులను ముస్లింలుగా గుర్తిస్తూ జీఓ విడుదల చేయాలని నూర్ బాషా దూదేకుల ముస్లిం మైనార్టీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సుంకేసుల ఖాదర్‌బాషా కోరారు. సంస్థ సభ్యులతో కలిసి డిప్యూటీ సీఎం అంజాద్‌బాషాను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఖాదర్ బాషా మాట్లాడుతూ నూర్ బాషా, నద్దాఫ్ పింజారి, దూదేకుల తదితర పేర్లతో పిలువబడుతున్న తాము బీసీ–బీలో ఉంటున్న మైనార్టీ సామాజిక వర్గానికి చెందిన వారమని వివరించారు. ప్రస్తుత అసెంబ్లీ సమావేశాల్లో ప్రత్యేక బిల్లు ప్రవేశపెట్టి దూదేకులకు ముస్లింలుగా వచ్చేలా జీవో వచ్చేందుకు కృషి చేయాలని కోరారు. దూదేకుల సామాజిక వర్గ పిల్లలకు విద్యాలయాల్లో ఇచ్చే టీసీలలో రెండు మతాలు చూపడంతో ఇబ్బంది కలుగుతోందన్నారు. ఈ మేరకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ, సంబంధిత అధికారులకు వినతులు పంపామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు గగ్గుటూరు రాజా, ఆయిల్‌మిల్ ఓబులేసు, దస్తగిరి, బాదుల్లా, పెద్దన్న, రాజు కుళాయప్ప, బాబు, బాబయ్య, సిద్ధయ్య, హుసేనయ్య తదితరులు పాల్గొన్నారు.

25న మున్సిపల్ కార్మికుల ధర్నా

కడప కార్పొరేషన్: న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ఈ నెల 25న నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్నట్లు ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు కె. తిరుపాల్, ఎస్.రవి పిలుపునిచ్చారు. స్థానిక అంధుల పాఠశాలలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ కార్మికులను వేధిస్తున్న సెక్రటరీలపై చర్యలు తీసుకోవాలని, వారి కుటుంబ సభ్యులకు ఉద్యోగాలివ్వాలని డిమాండ్ చేశారు. డ్రైవర్లకు వైద్య భత్యం ఇవ్వాలని, ఔట్ సోర్సింగ్ కార్మికులను రెగ్యులర్ చేయాలని కోరారు. యూనియన్ నాయకులు ప్రకాశ్, కిరణ్, ఆదాం, పుల్లయ్య, లక్ష్మి పాల్గొన్నారు.

26న చలో కలెక్టరేట్

కడప వైఎస్ఆర్ సర్కిల్: విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఈ నెల 26న నిర్వహించనున్న చలో కలెక్టరేట్‌ను జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గండి సునీల్ కుమార్, సగిలి రాజేంద్రప్రసాద్ పిలుపునిచ్చారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో విలేకరులతో వారు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థులు అనేక సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నారని తెలిపారు. పేద విద్యార్థులకు బాసటగా ఉన్న ప్రభుత్వ భవనాలలో సరైన వసతులు లేక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్ చార్జీలు రూ.3 వేలకు పెంచి కాస్మొటిక్ బిల్లులు విడుదల చేయాలన్నారు. డిగ్రీ, పీజీ కామన్ పరీక్షలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

ఆంగ్ల అనువాదంతో ప్రశ్నపత్రంలో తప్పులు

కడప వైఎస్ఆర్ సర్కిల్: ఉద్యోగ నియామక పరీక్షల ప్రశ్న పత్రాలు ఆంగ్లంనుంచి తెలుగులోకి అనువాదం చేయడంతో తప్పులు వస్తున్నాయని అఖిల భారత యువజన సమాఖ్య జిల్లా కార్యదర్శి ద్రవిడ సురేష్ అన్నారు. తెలుగులో ప్రామాణికం చేసుకుని ప్రశ్న పత్రాలు తయారుచేయాలని కోరుతూ రాష్ట్ర అధికార భాషా సంఘం సభ్యులు డాక్టర్ తవ్వా వెంకటయ్యకు శనివారం వినతిపత్రం అందజేశారు. సురేష్ మాట్లాడుతూ ఆంధ్ర ప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నియామకాలకు ఇచ్చే ప్రశ్న పత్రంలో తప్పులతో తెలుగు మాధ్యమ అభ్యర్థులు నష్టపోతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడుదస్తగిరి, నగర కార్యదర్శి యస్.కె.మైనుద్దీన్, ఉపాధ్యక్షుడు సంజీవ్ పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాలను సర్దుబాటు చేయాలని వినతి



డీఈఈకి వినతిపత్రం అందజేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

బద్వేలు అర్బన్ : స్థానిక సిద్దవటం రోడ్డులోని ఎరుకలకాలనీ నుంచి నాలుగు రోడ్ల కూడలి వరకు రోడ్డుకు ఇరువైపులా ఉన్న విద్యుత్ స్తంభాలను వెనక్కు సర్దుబాటు చేయాలని శనివారం డీఈఈ కుళాయప్పకు ప్రజా సంఘాల ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శి బి.గురుమూర్తి మాట్లాడుతూ విద్యుత్ స్తంభాలు రోడ్లపైన ఉన్నందున తరుచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని విద్యుత్ స్తంభాలను రోడ్డు చివరకు సర్దుబాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆవాజ్ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు సత్తార్, అన్వర్‌బాషా, బీసీ సంఘం నాయకులు శివరామయ్య, వైశ్య సంఘం నాయకులు ఎం.సుబ్బారావు, పూలే ఆశయసాధన సమితి నాయకులు రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

జాగ్రత్తలతో జ్వరాల నివారణ



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ శ్రీనివాసులు

ప్రొద్దుటూరు క్రైం : వర్షా కాలంలో కనీస జాగ్రత్తలు తీసుకోవడం వల్ల డెంగీ జ్వరాల నుంచి రక్షణ పొందవచ్చని డాక్టర్ శ్రీనివాసులు తెలిపారు. మండలంలోని పెద్దశెట్టిపల్లె గ్రామంలో ఉన్న సబ్‌సెంటర్‌లో శనివారం వైద్య శిబిరం నిర్వహించారు. బీపీ, షుగర్ పరీక్షలతో పాటు గర్భిణులు, బాలింతలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో 104 సిబ్బంది, డీఈఓ దేవరాజు, హెల్త్ ఎడ్యుకేటర్ శోభారాణి, హెల్త్ అసిస్టెంట్ లక్ష్మీనారాయణ, సంధ్యారాణి, ప్రమీల, రాధిక, ఆశా వర్కర్ మేరీ పాల్గొన్నారు.

కుందూనదికి భారీగా పెరిగిన నీరు



రాజుపాళెం: వెల్లాల వద్ద కుందూనదిలో ఉధృతంగా ప్రవహిస్తున్న నీరు

రాజుపాళెం : కర్నూలు, నంద్యాల జిల్లాలోని పలు ప్రాంతాల్లో కురిసిన వర్షం నీటితో మండల పరిధిలోని రాజోలి ఆనకట్ట, కుందూనదికి భారీగా నీరు పెరిగింది. అరకొర నీటితోనే గత మూడు రోజులుగా కుందూనదిలో వినాయకుడిని నిమజ్జనం చేస్తున్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో రక్తదానం



రక్తదాన కార్యక్రమంలో పాల్గొన్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు శశిభూషణ్‌రెడ్డి, ఇతర నాయకులు

ప్రొద్దుటూరు క్రైం : ప్రధాని నరేంద్రమోడి జన్మదినం సందర్భంగా దొరసానిపల్లెలోని గోపీకృష్ణ స్కూల్ ప్రాంగణంలో బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ప్రదీప్‌రెడ్డి ఆధ్వర్యంలో శనివారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు శశిభూషణ్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో బీజేవైఎం మాజీ పట్టణాధ్యక్షుడు పర్లపాడు గౌరీశంకర్, రవి, రాఘవ, సుధాకర్‌రెడ్డి, రామసుబ్బయ్య, వేమనారాయణ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ప్రభుత్వాసుపత్రిలో..

స్థానిక జిల్లా ప్రభుత్వాసుపత్రిలో బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి గొర్రెశ్రీనివాసులు ఆధ్వర్యంలో రక్తదానం చేశారు. కార్యక్రమంలో పార్టీ పట్టణాధ్యక్షుడు సుబ్రమణ్యం, కంబగిరి, భూషణం, రామచంద్రుడు, గోపు లక్ష్మీనరసింహుడు, మహమ్మద్‌రఫీ, డంకా రాజేష్, దిలీప్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలపై సమరశీల పోరాటాలు



యూటీఎఫ్ జెండాను ఆవిష్కరిస్తున్న రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు

బద్వేలు అర్బన్ : ప్రభుత్వ విద్యారంగ సమస్యల పరిష్కారానికి, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) సమరశీల పోరాటాలు కొనసాగిస్తోందని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వర్లు తెలిపారు. యూటీఎఫ్ స్వర్ణోత్సవ వేడుకల ప్రారంభోత్సవాలను పురస్కరించుకుని చేపట్టిన బైక్‌జాత శనివారం బద్వేలుకు చేరుకుంది. ఈ సందర్భంగా పట్టణంలో బైక్‌ర్యాలీ నిర్వహించి జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల ఎదుట యూటీఎఫ్ పతాకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. యూటీఎఫ్ 49 వసంతాలను పూర్తి చేసుకుని 50వ సంవత్సరంలోకి అడుగు పెట్టిందన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షులు కె.సురేష్, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.విజయకుమార్, మహేష్‌బాబు, గౌరవాధ్యక్షులు నాగార్జునరెడ్డి, సహాధ్యక్షుడు రవికుమార్, జిల్లా కార్యదర్శులు పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానం అమలు చేయాలి



తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న ఫ్యాప్టో నాయకులు

ప్రొద్దుటూరు : స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద శనివారం ఫ్యాప్టో ఆధ్వర్యంలో నల్ల రిబ్బన్లను ధరించి జీపీఎస్ వద్దు పాత పెన్షన్ విధానం అమలు చేయాలని ఉపాధ్యాయులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, ఫ్యాప్టో రాష్ట్ర నాయకుడు శ్యామ్‌సుందర్‌రెడ్డి మాట్లాడుతూ జీపీఎస్‌ను ఉద్యోగ, ఉపాధ్యాయులందరూ వ్యతిరేకిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ నాయకులు కృష్ణారెడ్డి, శ్రీనివాసరెడ్డి, సయ్యద్ బాషా, ఎస్టీయూ నాయకులు సలీం, సుబ్రహ్మణ్యం, శ్రీనివాసులు, ఫ్యాప్టో నాయకులు రమేష్ రెడ్డి, వెంకటేశ్వర్లు, జాన్ సురేష్, మోహన్‌రెడ్డిలతో పాటు ప్రొద్దుటూరు, చాపాడు, రాజుపాళెం మండలాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆర్‌సీపీఈ కళాశాలలో ప్రాంగణ ఎంపికలు



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులు

ప్రొద్దుటూరు కల్చరల్ : మండలంలోని రాయలసీమ వ్యాయామ విద్య కళాశాలలో ఆ కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో శనివారం ప్రాంగణ ఎంపికలు నిర్వహించారు. హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ ఎస్ఎస్ఎంపీఈ ఎంపీటీ స్పోర్ట్స్ సంస్థ ప్రతినిధులు రవి యాదవ్, ప్రశాంత్ ప్రాంగణ ఎంపికలు నిర్వహించారు. కళాశాలకు చెందిన 45 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ రవిశంకర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రాంగణ ఎంపిక నియామక అధికారి భాస్కర్‌రెడ్డి, ప్రశాంత్, శంకర్‌రెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

అసెంబ్లీలో మున్సిపల్ కార్మికుల సమస్యలపై చర్చించాలి

ప్రొద్దుటూరు : ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ సమావేశాల్లో మున్సిపల్ ఉద్యోగ, కార్మికుల సమస్యలపై చర్చించి పరిష్కరించాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ విజయకుమార్ తెలిపారు. శనివారం రెండో రోజు మున్సిపల్ కార్యాలయం వద్ద రిలే దీక్షలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో యూనియన్ పట్టణాధ్యక్షుడు చంటి, ప్రధాన కార్యదర్శి సాల్‌మోన్, రవికుమార్, శ్రీకాంత్, లూకయ్య, భాస్కర్, జీవరత్నం హరిబాబు, ఎలీషా తదితరులు పాల్గొన్నారు.

వైస్ చైర్మన్ జోక్యంతో వీధి లైట్ల ఏర్పాటు

ప్రొద్దుటూరు : కొర్రపాడు రోడ్డులోని పైపుల ఫ్యాక్టరీ వద్ద రోడ్డు వెంబడి మున్సిపల్ సిబ్బంది శనివారం వీధి లైట్లు ఏర్పాటు చేశారు. సంజీవనగర్, స్వరాజ్యనగర్ పరిధిలోని వైఎస్సార్‌సీపీ నాయకులు వీధి లైట్ల సమస్య గురించి మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డితో చర్చించారు. సమస్యకు స్పందించిన మున్సిపల్ వైస్ చైర్మన్ వెంటనే మున్సిపల్ సిబ్బందికి ఫోన్ చేయడంతో మధ్యాహ్నం సమయానికే వీధి లైట్లు అమర్చారు. మున్సిపల్ వైస్ చైర్మన్ తీసుకున్న చొరవ పట్ల వార్డు ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కమలాపురం చెరువుకు మైలవరం నీళ్లు



కమలాపురం లింక్ ఛానల్‌లో మైలవరం నీటిని పరిశీలిస్తున్న సంబటూరు ప్రసాద్‌రెడ్డి

కమలాపురం : కమలాపురం చెరువుకు మరో రెండు రోజుల్లో మైలవరం నీళ్లు వచ్చి చేరుతాయని హార్టికల్చర్ అడ్వైజర్ సంబటూరు ప్రసాద్‌రెడ్డి తెలిపారు. శనివారం పందిళ్లపల్లె సమీపంలోని కమలాపురం లింక్ ఛానల్‌లో ప్రవహిస్తున్న మైలవరం నీటిని ఆయన డీఈఈ రంగన్న, ఏఈఈ బాబుతో కలసి పరిశీలించి మాట్లాడారు. ఈ ఏడాది సకాలంలో వర్షాలు కురవక పోవడంతో కమలాపురం చెరువుకు నీరు రాలేదన్నారు. దీంతో ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి సూచన మేరకు మైలవరం అధికారులు దక్షిణ కాలువ ద్వారా కమలాపురం చెరువుకు 30 క్యూసెక్కుల నీళ్లు వదిలారన్నారు. ఆదివారం నుంచి మరో 40 క్యూసెక్కుల నీరు వదులుతారని, మొత్తం 70 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తారని తెలిపారు. ప్రస్తుతం ఆ నీళ్లు పందిళ్లపల్లె వద్ద ఉన్న 10.5 కి.మీ. రాయి వరకు చేరాయని, మరో రెండు రోజుల్లో కమలాపురం చెరువుకు చేరుతాయన్నారు. ఆయకట్టు రైతులు ఈ విషయాన్ని గమనించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ భాస్కర్, సర్పంచుల సంఘం అధ్యక్షుడు రామసుబ్బారెడ్డి, రైతులు పాల్గొన్నారు.

జేసీఎస్ కో ఆర్డినేటర్ల సమావేశం



మాట్లాడుతున్న మేయర్ సురేష్ బాబు

కడప కార్పొరేషన్: సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులకు బీమా చేయించాలని నగర మేయర్ కె.సురేష్ బాబు కోరారు. స్థానిక అపూర్వ కళ్యాణ మండపంలో జేసీఎస్ జిల్లా కో ఆర్డినేటర్లు, కడప క్లస్టర్ కన్వీనర్లతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీమాకు సంబంధించిన డాక్యుమెంట్లను అప్‌లోడ్ చేయడం వెంటనే పూర్తిచేయాలన్నారు. పోలింగ్ బూత్ కన్వీనర్లను నియమించాలని, కార్పొరేటర్లు, డివిజన్ ఇన్‌చార్జులతో సమన్వయం చేస్తూ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. జేసీఎస్ జిల్లా కో ఆర్డినేటర్ కె.నాగేంద్రరెడ్డి, మల్లికార్జున, రామలక్ష్మణ్‌రెడ్డి, రెడ్డి ప్రసాద్ పాల్గొన్నారు.